క్లుప్తంగా

పర్యావరణ హిత జీవనంపై అవగాహన



దూబచర్ల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసరావు

నల్లజర్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలని నల్లజర్ల సెక్షన్ ఫారెస్ట్ డీఆర్వో చల్లా శ్రీనివాసరావు సూచించారు. పర్యావరణ హిత జీవనంపై శుక్రవారం దూబచర్లలోని వైఎస్సార్ వసంత్ నగర్ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించిన దృష్ట్యా ప్రజలంతా క్లాత్, జనపనార సంచులనే వినియోగించాలన్నారు. తమ దిన చర్యలు మార్పు చేసుకుంటామని, తనతో పాటు కుటుంబ సభ్యులు కూడా పర్యావరణ హిత జీవితం గడుపుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రత్నం, బీట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

30న నిడదవోలు మండల పరిషత్ సమావేశం

నిడదవోలు రూరల్: నిడదవోలు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని ఈనెల 30వ తేదీ మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ టి.మూర్తిబాబు శుక్రవారం తెలిపారు. సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

కరెంట్ పోయిందా.. 1912 కు కాల్ చేయండి



అచ్యుతాచారి, ట్రాన్స్‌కో ఈఈ

కొవ్వూరు/నిడదవోలు: ఏ ప్రాంతంలో అయినా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే 1912 నంబర్‌కు కాల్ చేయాలని ఏపీ ఈపీడీసీఎల్ నిడదవోలు విద్యుత్ డీఈఈ పి.అచ్యుతాచారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే సిబ్బంది వచ్చి తగు చర్యలు తీసుకుని విద్యుత్తు సరఫరాను పునరిద్ధరిస్తారని ఆయన స్పష్టం చేశారు. వేసవి కారణంగా కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో సాంకేతిక లోపాలతో పాటు డిమాండ్,సరఫరాలో వ్యత్యాసం వల్ల గత వారంలో విద్యుత్ సరఫరాకు కొంత అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు తగ్గడంతో డిమాండ్‌కు సరిపడా విద్యుత్ ఉన్నందున ఎలాంటి కోతలు విధించడం లేదన్నారు.

ఉద్యోగం పొందిన యువకుడికి నగదు పురస్కారం



ఉద్యోగం సాధించిన బాలును సత్కరించిన మానవత సంస్థ సభ్యులు

తాళ్లపూడి: రాజస్థాన్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించిన అన్నదేవరపేటకు చెందిన తాడేపల్లి బాలు అనే యువకుడికి మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ప్రతిభా పురస్కారాన్ని అందజేసింది. ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం రూ.25 వేల చెక్కు, జ్ఞాపిక అందజేశారు. ఆ యువకుడి తల్లిదండ్రులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంస్థ రీజినల్ చైర్మన్ వి.చంద్రయ్య, సింహాద్రి జనార్దనరావు, సాయన సుబ్బారావు, వీరమల్లు సూర్యనారాయణ, గోకవరపు బాబులు బి. శంకర్, ఎ. సురేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో భూ సర్వే ప్రారంభం

నిడదవోలు రూరల్: అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన, భూ వివాదాలు, పొలం గట్ల సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా భూముల సమగ్ర భూముల రీసర్వే చేపట్టినట్లు తహసీల్దార్ ఎం.గంగరాజు తెలిపారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో డ్రోన్‌తో భూ సర్వేను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, నాయకులు కస్తూరి సాగర్, రీసర్వే డీటీ ఎం.నాగలక్ష్మి, మండల సర్వేయర్ పి.దిలేశ్వర రావు, సర్వేయర్ దర్శిపూడి తేజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడికి 14 రోజుల రిమాండ్

పెరవలి: ఓ బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడైన మండలంలోని అన్నవరప్పాడుకు చెందిన ఆకుమర్తి సూర్యారావు అనే యువకుడ్ని అరెస్టు చేశామని పెరవలి ఎస్‌ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. అతడిని శుక్రవారం తణుకు కోర్టులో హాజరు పరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించాలని చెప్పారు. కాగా ఈ నెల 19న అన్నవరప్పాడులో బాలిక ఉరివేసుకున్న కేసులో ఆకుమర్తి సూర్యారావు నిందితుడని ఎస్‌ఐ చెప్పారు.

విద్యా కానుకలు సిద్ధం

- ఇప్పటికే మండల వనరుల కేంద్రాలకు..
- నియోజకవర్గంలో 160 స్కూళ్లలో 14,750 మంది విద్యార్థులు
- జూన్ 10 నాటికి పాఠశాలలకు చేరేలా ఏర్పాట్లు



పెరవలి ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన పాఠ్య పుస్తకాలు

పెరవలి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా అందిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లు పాఠశాలలు తెరవడానికి ముందుగానే మండల వనరుల కేంద్రాలకు చేరాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ పేద విద్యార్థీ పాఠశాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని రకాల విద్యా సామగ్రిని విద్యార్థులకు అందిస్తోంది. గత ప్రభుత్వాలు కేవలం పాఠ్య పుస్తకాలు మాత్రమే ఇచ్చివి. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు స్కూల్ బ్యాగ్, షూస్, సాక్స్, నోట్ బుక్స్, బెల్ట్ వంటి వాటిని 'జగనన్న విద్యాకానుక కిట్ ' పేరుతో అందిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరిపడా విద్యాకానుక కిట్లు ఇప్పటికే మండల వనరుల కేంద్రాలకు చేరాయి. జూన్ 10వ తేదీ నాటికి మండలంలోని ఆయా పాఠశాలలకు ఈ కిట్లను తరలించటానికి విద్యాశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఏయే పాఠశాలలకు ఎన్నెన్ని పంపించాలో తరగతుల వారీగా ఆయా పాఠశాలల విద్యార్థుల సంఖ్యను బట్టి మండల కేంద్రాల్లో కిట్లు సిద్ధం చేస్తున్నారు.

నిడదవోలు నియోజకవర్గంలో మండలాల వారీగా విద్యార్థుల సంఖ్య

మండలం	ప్రాథమిక పాఠశాలలు	హైస్కూళ్లు	విద్యార్థుల సంఖ్య
1.పెరవలి	41	7	3,947
2.ఉండ్రాజవరం	32	8	4,094
3.నిడదవోలు	60	12	6,709
మొత్తం	133	27	14,750

నియోజక వర్గంలో ఎన్ని పాఠశాలలు

నిడదవోలు నియోజక వర్గంలో 133 ప్రాథమిక పాఠశాలలు. 27 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ఒకటి నుంచి పదో తరగతి వరకూ చదివే 14,750 మంది విద్యార్థులు ఉన్నారు. వారందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందించనున్నారు.

జగనన్న కిట్లలో ఏం ఉంటాయి?

ప్రతి జగనన్న విద్యాకానుక కిట్‌లోనూ ఒక స్కూల్ బ్యాగ్, ఒక బెల్ట్, ఒక జత షూష్, రెండు జతల సాక్స్, మూడు జతల యూనిఫాం, మూడు సెట్ల నోట్ పుస్తకాలు (ఒక సెట్టులో 6 నోట్స్ పుస్తకాలు ఉంటాయి), ఒక సెట్ పాఠ్య పుస్తకాలు ఉంటాయి. దీంతో విద్యార్థి విద్యా సంవత్సరం పొడవునా నోట్ పుస్తకాలు గాని, పాఠ్య పుస్తకాల కాని కొనే పని ఉండదు. ఆ మేరకు విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గుతుంది.

పెరిగిన విద్యార్థుల సంఖ్య

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య గతేడాది కంటే ఈ ఏడాది పెరిగింది. ఒకటి నుంచి పదో తరగతి వరకూ చదివే విద్యార్థుల సంఖ్య నిడదవోలు నియోజకవర్గంలో గతేడాది 12,892 మంది ఉంటే ఈ ఏడాది 14,750కి పెరిగింది. గతంలో కంటే విద్యార్థుల సంఖ్య 1858 పెరిగింది. వచ్చే నెలలో పాఠశాల ప్రారంభం అయ్యే సమయానికి ఈ సంఖ్య మరింత పెరగవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



జగనన్న విద్యా కానుక కిట్

అంతా సిద్ధం చేస్తున్నాం



వచ్చే విద్యా సంవత్సరంలో మండలంలోని విద్యార్థులు అందరికీ సరిపడా జగనన్న విద్యాకానుక కిట్లు ఇప్పటికే వచ్చాయి. ఈ ఏడాది ముందుగానే ప్రభుత్వం వాటిని సిద్ధం చేసింది. జూన్ 12న పాఠశాలలను తెరుస్తారు. జూన్ 10వ తేదీ నాటికే అంటే రెండు రోజుల ముందుగానే అన్ని పాఠశాలలకు విద్యా కానుక కిట్లు తరలించేందుకు ఏర్పాట్లు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం సకాలంలో విద్యార్థులకు వాటిని అందిస్తాం.

– డి హైమావతి, ఎంఈఓ, పెరవలి మండలం

టెన్త్ మెరిట్ విద్యార్థులకు మంత్రి బొత్స అభినందనలు



మెరిట్ విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: ఇటీవల విడుదలైన టెన్త్ పరీక్ష ఫలితాల్లో 561 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన మండలంలోని యాదవోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని షేక్ షబియా, శ్రీచైతన్య స్కూల్లో 587 మార్కులు సాధించిన విద్యార్థి వెంపాటి జయసాయికృష్ణను మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం అభినందించారు. మండలంలోని పల్లంట్ల గ్రామంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) స్వగృహంలో విద్యార్థులు మంత్రిని కలిశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు పాల్గొన్నారు.

చెరకు తోటకు నీరు విడుదల



వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం నుంచి పిల్ల కాలువకు ప్రవహిస్తున్న నీరు

సాక్షి ఇంపాక్ట్

తాళ్లపూడి: 'చెరకు తోటకు నీరందివ్వాలి' అనే శీర్షికతో ఈ నెల 22న 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. నీరు లేక తన చెరకు తోట ఎండిపోతోందని, ఎత్తిపోతల పథకం ద్వారా పిల్ల కాలువకు కూడా నీరు అందివ్వాలని వేగేశ్వరపురం గ్రామానికి చెందిన శూలా పోశియ్య అనే రైతు కోరారు. ఈ విషయమై ఆ రైతు స్పందనలో సైతం అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎత్తిపోతల పథకం కమిటీ పిల్ల కాలువలకు నీరు ఇవ్వడానికి చర్యలు తీసుకున్నారు. సాక్షికి, అధికారులకు రైతు పోశయ్య కృతజ్ఞతలు తెలిపారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- నిడదవోలులో వలంటీర్లకు వందనం



నిడదవోలులో పురస్కారాలు స్వీకరించిన వలంటీర్లతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



యర్నగూడెంలో పురస్కారాలు పొందిన వలంటీర్లతో ఎంపీపీ దుర్గారావు, అధికారులు

నిడదవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. వార్డు వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక రోటరీ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు ఆ అవసరం లేకుండా అర్హత ఉన్న లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వలంటీర్లు వెళ్లి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. తమకు కేటాయించిన విధులను సేవాభావంతో సమర్థవంతంగా నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని ఈ సందర్భంగా ఆయన వలంటీర్లకు సూచించారు. అనంతరం సేవా వజ్రలుగా షేక్ షర్మిల, అరేళ్ల చంద్రశేఖర్‌లకు, సేవా రత్నలుగా ఇర్లపాటి కవిత, లొల్లా దుర్గ, ఆర్ సంధ్యాకుమారి, అయినవల్లి దుర్గ, యాగాటి సంధ్యాదేవిలకు ఎమ్మెల్యే పురస్కారాలు అందించి సత్కరించారు. వారితో పాటు మరో 192 మంది వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు ఎస్‌కే వజీరుద్దీన్, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ కార్యదర్శి గాజుల రంగారావు, కామిశెట్టి సత్యనారాయణ, ఎస్‌కే చాన్ బాషా, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జులు, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యర్నగూడెంలో..

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం, సంగాయగూడెం, త్యాజంపూడి గ్రామ వలంటీర్లకు యర్నగూడెం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు సేవా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో గ్రామ వలంటీర్లు కీలకంగా ఉన్నారని కొనియాడారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లోని గ్రామ వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు బొంతా భరత్‌బాబు, కుసులూరి స్వరూపరాణి, కరుటూరి ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు సుంకవల్లి చిన వెంకటరమణ, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, పలువురు పార్టీ నాయకులు, గ్రామ సచివలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- నల్లజర్లలో గడప గడపకూ..



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిఒక్కరూ అండగా ఉండి మరోసారి ఆశీర్వదించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. నల్లజర్ల- 1వ వార్డులో శుక్రవారం సాయంత్రం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. పంచాయతీ సర్పంచ్ సర్పంచ్ పల్లి జ్యోతి, ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, ఎంపీటీసీ సభ్యురాలు మేణ్ణి వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కండెపు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆక్రమణలకు గురవుతున్న దళితుల శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మించి, అక్కడ నీరు, ఇతర వసతులు కల్పించాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రూ.10 లక్షల వ్యయంతో శ్మశానవాటికను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. ఎపుడో వేసిన విద్యుత్ స్తంభాలు ఇళ్ల పైకి వస్తున్నాయని వాటి స్థానంలో కొత్త స్తంభాలు వేసి, లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలని మరికొందరు కోరారు. ఎస్సీ కాలనీకి ఎదురుగా గల ప్రధాన రహదారి వెంబడి డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు నిర్మించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే తలారి సూచించారు. నాలుగేళ్ళ పాలనలో అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల బుక్‌లెట్‌లను ఆయన ఇంటింటా అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు కిశోర్‌కుమార్, ఎంపీడీఓ జోగేశ్వరరావులతో పాటు వివిధ శాఖల అధికారులు, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, నాయకులు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, మద్దిపాటి ప్రసాద్, పల్లి సుబ్బారావు, మేణ్ని యువరాజు పాల్గొన్నారు.

పాలంగిలో ఫ్యామిలీ డాక్టర్

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య బృందం గ్రామంలో లేవలే స్థితిలో ఉన్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి,మందులు అందించారు. ఈ సందర్భంగా క్షయ విభాగం సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ ఆశాజ్యోతి మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు పోషకాహారం అందించడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ముక్త భారత్ సాధన కోసం పోస్టర్‌ను ప్రదర్శించి సహకరించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ జె.శ్రీనివాసు, కె.సోపోర, హెచ్‌వీ నాగమణి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

చాగల్లు: చక్కని వసతులు, మెరుగైన బోధన అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు చేర్పించాలని ఎంఈవో వి.ఖాదర్‌బాబు సూచించారు. పలువురు ఉపాధ్యాయులు, సీఆర్పీలతో కలిసి శుక్రవారం ఆయన చాగల్లులో చిన్నారుల తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి కలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరు, బోధన, సాధిస్తున్న ఫలితాలు, మౌలిక సదుపాయాలను వివరించారు. నాణ్యమైన విద్య పొందాలంటే పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని కోరారు.

ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ర్యాలీ



ఉండ్రాజవరంలో పండ్ల దుకాణం యజమానికి అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ వీరాస్వామి నాయుడు

ఉండ్రాజవరం: ప్లాస్టిక్ విక్రయాలకు, వాడకానికి వ్యతిరేకంగా శుక్రవారం ఉండ్రాజవరంలో ర్యాలీ నిర్వహించారు. మేరీ లైఫ్ ప్రోగ్రాం(క్లీన్ విలేజ్ కాన్సెప్ట్)లో భాగంగా ఈ ర్యాలీ జరిగింది. ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామినాయుడు ఆధ్వర్యంలో వారీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 125 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్లు, డిస్పోజబుల్ గ్లాజులను వాడడం, అమ్మడం నిషేధం అన్నారు. అందుకు భిన్నంగా ఎవరైనా నిషేధిత పాలిథిన్ కవర్లు, గ్లాసులు అమ్మితే రూ.1000 జరిమానా విధిస్తామని చెప్పారు. గ్రామస్తులకు ప్రజలకు, దుకాణ యజమానులకు అవగాహన కల్పించేందుకు పాలిథిన్ కవర్ల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రత్యామ్నాంగా జూట్, క్లాత్ సంచులను వాడాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.సుదీప్తి, గ్రామ వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురంలో..

గోపాలపురం: ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం నిషేధం విధించినా వాడకం తగ్గలేదని ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి అన్నారు. శుక్రవారం నాటి గోపాలపురం వారపు సంతలో కూరగాయలకు వ్యాపారులు ప్లాస్టిక్ సంచులు ఇవ్వడాన్ని గుర్తించిన ఎంపీడీఓ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.మేరీ లైఫ్‌లో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ పైడి శిరీష , వైఎస్సార్ సీపీ నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, ముల్లంగి శ్యామ్‌సుందర్‌రెడ్డి, కార్యదర్శి ఎం చిన వెంకాయమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

గోపాలపురం: సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇంటర్నేషనల్ ఫోన్ నంబర్లతో వాట్సప్ చాటింగ్ ద్వారా పరిచయం చేసుకుంటారు. యూట్యూబ్ లింకులు పంపి వాటిని లైక్ చేసి షేర్ చేస్తే రూ.50 ఇస్తామని మిమ్మల్ని మభ్యపెడతారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించవచ్చని క్రిప్టో కరెన్సీ, ట్రేడింగ్ టాస్కులు అని మీచేత అధిక మొత్తంలో డబ్బులు వాళ్ల అకౌంట్‌లో వేయించుకుంటారన్నారు. ఇలాంటి సైబర్ నేరగాళ్లు వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి ఆపరేట్ చేస్తుంటారని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.